క్లుప్తంగా

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

వీరవాసరం: పశు వైద్యాధికారుల సూచనలు, సలహాలతో పశు సంరక్షణ నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధక వైద్యాధికారి కే మురళీకృష్ణ తెలిపారు. వీరవాసరం మండలంలో నిర్వహిస్తున్న గాలికుంటూ వ్యాధి నిర్మూలన టీకాల కార్యక్రమంలో పాల్గొని బుధవారం ఆయన మాట్లాడారు. పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ద్వారా అధిక పాల దిగుబడిని సాధించవచ్చు అన్నారు. పోషకాలతో కూడిన దానాను ఇచ్చి పశువులు బలవర్ధకంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నౌడూరులో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని జిల్లా ఉప వైద్యాధికారి జాఫర్ హుస్సేన్ పరిశీలించారు. సుమారు 300 పై చిలుకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ప్రియాంక, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఆకివీడు: స్థానిక సంతపేటలో మైనర్ బాలిక మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు.

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా

పాలకోడేరు: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి భీమవరం స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎంవీ ఎన్ రాజారావు బుధవారం జరిమానా విధించారు. మండలంలో వివిధ గ్రామాల్లో బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేసిన పోలీసులు ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించి కేసు నమోదు నమోదు కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు జడ్జి ఒక్కొకరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని పాలకోడేరు ఎస్సై ఎం.రవి వర్మ తెలిపారు.

పీ-4 సర్వే పరిశీలన

భీమవరం అర్బన్: జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పీ-4 సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి అప్పారావు అన్నారు. బుధవారం కొవ్వాడ అన్నవరం గ్రామంలో జరుగుతన్న పీ-4 సర్వేను ఆయన పరిశీలించారు. పీ-4 సర్వే, వర్క్‌ఫ్రం హోం తదితర సర్వేలను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్ష్యం చెబితే చంపుతా అంటూ బెదిరింపు

భీమవరం: హత్యాయత్నం కేసులో తనపై వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపుతానని ఒక వ్యక్తిని బెదిరించిన సంఘటన భీమవరం రెండవ పట్టణంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ ఏఎస్ ఐ ధర్మారావు తెలిపిన వివరాల ప్రకారం వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన హత్యాయత్నం కేసులో చిత్తజల్లు గోపీకిషోర్ అనే వ్యక్తి మూడవ సాక్షిగా ఉన్నాడు. కొంత కాలంగా కోర్టులో వాయిదాలకు వస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 11వ తేదీ ఉదయం సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు వచ్చాడు. కోర్టు సాయంత్రం వరకు వాయిదా వేయడంతో గోపీకిషోర్ బయటకు వచ్చేశాడు. అయితే అదే కేసులో నిందితుడిగా ఉన్న రొంగల అరుణ్ కుమార్ కిషోర్‌ను తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపుతానని రకరకాలుగా బెదిరించాడు. దీంతో గోపికిషోర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ధర్మారావు తెలిపారు.

డీఎంహెచ్‌ఓ నియామకమెప్పుడో?

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ ఓ) పోస్టు ఖాళీ అయి రెండు నెలలు దాటుతున్నా ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తున్నారు. గతంలో డీఎంహెచ్‌ఓగా పనిచేసిన డాక్టర్ మహేశ్వరరావు రెండు నెలల క్రితం పదవి విరమణ తీసుకున్నారు. అప్పటినుంచి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ భానునాయక్ పనిచేస్తున్నారు. జిల్లా ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందాలంటే వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి కచ్చితంగా ఉండాలి. అలాగే వైద్యారోగ్య శాఖ జిల్లాకు సంబంధించి డీపీఎంఓ (జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారి), ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాలిక సురక్ష కార్యక్రమం) అధికారి పోస్టులకు కూడా శాశ్వత అధికారులు లేరు. దీంతో ఆయా బాధ్యతలను ఇన్‌చార్జిలే చూస్తున్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందాలంటే ఆయా ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 10వ వార్డుకు చెందిన మైనర్ బాలిక(16)కు మంగవారం రాత్రి వివాహం చేసేందుకు నిశ్చయించగా ఐసీడీఎస్, పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. బాలికను తణుకు బాలసదన్‌కు, అక్కడ నుంచి ఏలూరు సీడబ్ల్యూసీ హోంకు పంపించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజ్ దుర్గ భవాని తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

కాళ్ల: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని పెదఅమిరం జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ, నరసాపురం పార్లమెంటరీ అధ్యక్షురాలు గూడూరు ఉమాబాల, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపిల సమక్షంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందరిని ఆర్థికంగా పైకి తీసుకురావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పడిందని చెప్పారు. ప్రజల మన్నలను పొంది పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఇచ్చిన హామీలు అమలు చేసి వైఎస్సార్ మాదిరిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని స్పష్టం చేశారు. అయితే అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రజలను నేడు కష్టాలపాలు చేసిందని విమర్శించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి పెద్ద ఎత్తున చేరిన పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలతో యువత పోరు కార్యక్రమానికి భీమవరం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, పార్టీ నాయకులు బంధన పూర్ణచంద్రరావు, పెరిచర్ల విజయ నరసింహరాజు, గాదిరాజు రామరాజు, చిగురుపాటి సందీప్,జల్లా కొండయ్య,చినమిల్లి వెంకట్రాయుడు, పెండ్ర వీరన్న, వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, గణేశ్న రాంబాబు, పెనుమత్స ఆంజనేయరాజు, పళ్లెం అరుణ, నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, వీరమల్లు బోసు, కటారి లక్ష్మీపతి రాజు, సుందర్ కుమార్, మంతెన సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నాడు.

పేదల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ

ఆకివీడు: పేదలు, బడుగు బలహీన, ఎస్సీ,ఎస్టీ వర్గాలు, రైతు, మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ పుట్టిందని సర్పంచ్ నందమూరి ప్రకాశం, వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, మంతెన సునీల్ కుమార్ చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లి, కమతవాని గూడెం గ్రామంల్లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేకు కట్ చేశారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కెఎల్ఎన్. వర్మ, మాజీ ఉపసర్పంచ్ ఎరిచర్ల గ్లాడ్‌సన్, సాంబర్లిన్,అద్దంకి ప్రసాద్, పాము సుందరరావు, కమతం కాంతారావు, కటికతల సాల్మన్‌రాజు, అబ్రహం, దావీదు, ఇమ్మానియేలు, కుర్రేళ్ల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



కాళ్ల: కేక్ కట్ చేసి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు తినిపిస్తున్న పీవీఎల్



కాళ్ల: యువతపోరు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు



ఆకివీడు: కమతవానిగూడెంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ నందమూరి ప్రకాశం, వైస్ ఎంపీపీ ఎస్.సూర్యనారాయణ



వీరవాసరం: వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

వీరవాసరం: దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి తెలిపారు. మండల కేంద్రమైన వీరవాసరంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి వైఎస్సార్ బాటలో నడుస్తూ ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం యువత పోరు కార్యక్రమానికి జిల్లా కేంద్రమైన భీమవరంకు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ మండల శ్రేణులు, పార్టీ అభిమానులు , కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, వీరవల్లి శ్రీనివాసరావు, డి.వి.డి ప్రసాద్, కందుల సత్యనారాయణ, పంజా సురేష్, ప్రవీణ్ ,కందుల వెంకటేశ్వరరావు, సైదు శ్రీనివాస్, నాగరాజు గోపాలకృష్ణంరాజు, కడలి శ్రీరాములు, పెచ్చెట్టి శ్రీరామచంద్రమూర్తి, పిల్లి నరసింహమూర్తి, చిట్టిబాబు, సర్వేశ్వరరావు, మతల కాశి, జి.బాబ్జి, వీరవల్లి కోటేశ్వరరావు, మద్దాల బాబి, గుబ్బల రాంప్రసాద్, సీహెచ్ కొండా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే ప్రజలకు సుపరిపాలన

భీమవరం అర్బన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందజేశారని ఆ పార్టీ మండల కన్వీనర్ జల్లా కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావు అన్నారు. భీమవరం మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో 15వ వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జల్లా కొండయ్య, తిరుమాని తులసీరావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని తదానంతరం రెండేళ్లు కరోనా వచ్చి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయినప్పటికీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఐదేళ్లలో రూ. 2 లక్షల 70 వేల కోట్లు సంక్షేమ పథకాలు అవినీతి, అక్రమాలు తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో వేసి వారి మనసుల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు. అంతేకాకుండా గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పోర్టులు, 18 మెడికల్ కళాశాలలు ఇలా ఎన్నో అభివృద్ధి చేసి చూపించారన్నారు. 2024లో ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. దీంతో రాష్ట్ర ప్రజలలో కూటమి ప్రభుత్వం పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇప్పుడు ఎన్నికలు నిర్వహించినా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని జోష్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లాటి సోమరాజు, వీర్రాజు, ప్రసాద్, జల్లా వెంకన్న, రాము, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో...

దిరుసుమర్రు, యనమదుర్రు, అనాకోడేరు, కొమరాడ, వెంప తదితర గ్రామాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్: కొత్తపూసలమర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

యువతపై లాఠీ-చార్జీ దారుణం

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమం చేపడితే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, నిరసన చేస్తున్న యువతపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం దారుణమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో డీఆర్వో ఎం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరుతుంటే పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని పోలీస్ తీరు మార్చుకోవాలని మంగరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు మానికొండ శ్రీనుబాబు, కోట రత్న రాజు, మహమ్మద్ చాన్ భాషా, ఎం నాగేశ్వరరావు తదితరులున్నారు.



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న మంగరాజు

బొండాడలో సంతానలేమిపై ఉచిత వైద్య శిబిరం


కాళ్ల: మండలంలోని బొండాడ పంచాయతీ కార్యాలయంలో సంతానలేమిపై బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గిఫ్ట్ ఫెర్టిలిటీ హాస్పిటల్ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ వి.యస్. శిల్ప వైద్య సేవలు అందించారు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న వారికి మళ్లీ ట్యూబులు ఓపెన్ చేసే ట్యూబల్ రీకెనలేజేషన్ ఆపరేషన్ వంటి వైద్య సేవల గురించి వివరించారు. న్యూరో ఫిజిషియన్ జేఎస్ కుమార్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మన్నే నాగరాజు, కందుల హనుమ,మన్నె శ్రీనివాస్, మందపాటి రవి, మన్నే సోమేశ్వరరావు,పచ్చి గోళ్ళ సత్యనారాయణ, సేనాపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామ పెద్దలు

లిటిల్‌చాంప్స్ ఒలింపియాడ్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

భీమవరం: హైదరాబాద్ లిటిల్‌చాంప్స్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలుగు ఒలింపియాడ్‌లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు మొదటి, ఆరవ ర్యాంకులు సాధించారని స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు అన్నారు. మంగళవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను తెలిపారు. గత అక్టోబర్ 30వ తేదిన నిర్వహించిన ఒలింపియాడ్‌లో ఆరో తరగతి విద్యార్థి కె రోషితశ్రీసంజన రాష్ట్రస్థాయి మొదటిర్యాంకు సాధించగా రూ. 3,500 నగదు, జ్ఞాపిక, 7వ తరగతి విద్యార్థి జె సాయిసిద్ధిభిషా 6వ ర్యాంకుసాధించగా జ్ఞాపిక, బుక్ బహుమతి అందుకున్నట్లు చెప్పారు. తమ స్కూల్లో చదవుతో పాటు క్రీడలు, సాంస్కృతిక పోటీలేగాకుండా పోటీ పరీక్షలకు తగిన తర్ఫీదు ఇవ్వడంతో మంచిఫలితాలు సాధిస్తున్నట్లు కృష్ణంరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి శ్రీనివాస్, బి యుగసుధ, కె సత్యనారాయణ, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రొయ్యల చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



ఆక్వా కార్మికులతో ఎంపెడా అధికారులు

ఆకివీడు: రొయ్యల చెరువులపై పనిచేసే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ మెహతా చెప్పారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని ఎస్సీ, ఎస్టీ ఆక్వా కార్మికులకు బుధవారం పరిశుభ్రత కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల చెరువుల్లోకి వైరస్ ప్రబలకుండా పరిశుభ్రంగా ఉండాలన్నారు. ముప్పైమంది లబ్ధిదారులకు రెయిన్ కోట్, టీషర్టు, షూ, క్యాప్, బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో జేటీఓస్ దుర్గారావు, ఎఫ్‌డీఓ రాంబాబు, ఏఎఫ్‌డబ్ల్యూఎస్ అధ్యక్షులు కటికతల జాన్సీ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి

పాలకోడేరు: ప్రస్తుతం ఎంతో పని ఒత్తిడితో సతమతం అవుతున్న పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పని పంచాయతీ కార్యదర్శులకూ అప్పగించడం వల్ల పని ఒత్తిడిలో ఆందోళనకు గురై ఆరోగ్యాలు పాడవుతున్నాయన్నారు. మండలంలోని కార్యదర్శులు అందరూ బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను, పని ఒత్తిడి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ వి.రెడ్డియ్య కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యదర్శులు మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాని కోరారు. కార్యక్రమంలో జి.కృష్ణమోహన్, కె.సుజాత, పి.సరళ, కె.పవన్ కుమార్, కేదారేశ్వర రావు, బాలకృష్ణ, బంగారు గోపి, అడబాల రాంబాబు, కె.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులపై మోపుతున్న పని ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి దాపురిస్తుందని, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డికి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ సర్వేల వల్ల పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జేవీటీ నాయుడు, కె.గోపాలకృష్ణ, ప్రవీణ్, శివాజీ, శ్రీలత, లక్ష్మీ, కళ్యాణి, విజయలక్ష్మీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పని ఒత్తిడి తగ్గించాలంటూ కాళ్ళ ఎంపీడీవో జి.స్వాతికి బుధవారం కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయితీస్థాయిలో వ్యవహారాలను చూసుకుంటూనే, సచివాయల సిబ్బంది చేయాల్సిన పనులను కూడా ఒకే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి రావడం వల్ల తీవ్రఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఉన్నతాధికారులు ఎవరి పనులు వారికి విడివిడిగా ఇవ్వాలని కోరారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు డి.సునీల్ రాజు, బి.సతీష్ కుమార్, ఎస్. వెంకటేష్ పాల్గొన్నారు.



పాలకోడేరు: ఎంపీడీఓ రెడ్డియ్యకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు



ఉండి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సై- టీబీ పరీక్ష ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి టి.బి విభాగంలో సై-టి.బి పరీక్ష ను బుధవారం ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి భానునాయక్ ప్రారంభించారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టి.బి సోకి మందులు వాడుతున్న వ్యక్తి కుటుంబ సభ్యులకు సై-టి.బి పరీక్ష చేయడం జరుగుందన్నారు. ఈపరీక్ష చేతిపై ఏమాత్రం నొప్పి కలిగించకుండా ఇంజక్షన్ ద్వారా ఈ పరీక్ష చేయడం జరుగుతుందన్నారు. 48 గంటల నుంచి 72 గంటల్లోపు రిపోర్టు తెలుస్తుందన్నారు. ఈ పరీక్ష చేయడం ద్వారా క్షయ వ్యాధి ప్రారంభం దశలో గుర్తించి వారిలో ఈవ్యాధి ముదరకుండా ముందస్తుగా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ కె.చంద్రదొరరెడ్డి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ ఎస్. వరప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్‌జేఎస్ హరికుమార్, డిపిఎస్ పి.సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్. హర్ష, భవ్య సిబ్బంది మధుమతి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ విభాగంలో సై-పరీక్షను ప్రారంభిస్తున్న భానునాయక్

నేడు విభిన్న ప్రతిభావంతులకు బస్‌పాస్‌ల పంపిణీ

ఆకివీడు: విభిన్న ప్రతిభావంతులకు ఆర్టీసీ టిక్కెట్లపై 50 శాతం రాయితీ అందించే బస్‌పాసులను గురువారం ఆకివీడు కొత్త బస్టాండ్ వద్ద పంపిణీ చేయనున్నట్లు వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి నటరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విభిన్న ప్రతిభావంతులు వైకల్యం ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీ, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో బస్టాండ్‌కు రావాలని పేర్కొన్నారు. బస్‌పాస్ కోసం రూ.100 చెల్లించాలని తెలిపారు. మండల పరిసర ప్రాంతాల్లో నివసించే శారీరక, అంధత్వం, చెవిటి-మూగ, బుద్ధి మాంద్యం తదితర వైకల్యంతో ఉన్న దివ్యాంగులు బస్‌పాస్‌కు అర్హులని వివరించారు.

పొంచి ఉన్న పెనుప్రమాదం

పాలకోడేరు: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే భీమవరం -తణుకు రహదారిలో పాలకోడేరు మండలం మోగల్లు-కోరుకొల్లు గ్రామాల సరిహద్దులో ప్రధాన రహదారిలో ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగి చాలా కాలం అయినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు గమనించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారిపై నిత్యం అనేక వందల వాహనాల్లో ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం ఎప్పుడు విరిగి రోడ్డుపై పడుతుందో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం సంభవించక ముందే విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం వేసి ప్రజల ప్రాణాలను స్థానికులు కోరుతున్నారు.



భీమవరం -తణుకు మోగల్లు ప్రధాన రహదారి పక్కనే విరిగిన విద్యుత్ స్తంభం